సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



రూ.7లక్షలు నొక్కేశారు..
కామారెడ్డి జిల్లాకు చెందిన గొర్ల కాపరి డాక్యుమెంట్లతో కేటుగాళ్లు రూ.7లక్షల లోన్ నొక్కేశారు.
- 8లో ▸



బాల్కొండలో కత్తిపోట్లు
పాతకక్షలతో ఇద్దరు అన్నదమ్ములు కలిసి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. అడ్డుకోవడానికి వెళ్లిన వ్యక్తికీ గాయాలయ్యాయి
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /18.5

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉండకపోవచ్చు.

న్యూస్‌రీల్

ఫైనల్‌కు చేరిన నిఖత్



నిజామాబాద్‌నాగారం: అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ ప్రత్యర్థులను తన పంచ్‌లతో చిత్తు చేస్తోంది. శనివారం నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచ్‌లో బల్గేరియాకు క్రీడాకారిణిని 5-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరింది. వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన నిఖత్.. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో బంగారం లేదా రజత పతకం సాధించడం ఖాయమైంది.

'సృజన'లో ప్రథమ బహుమతి



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రస్థాయి సృజన టెక్ ఫెస్ట్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామంతాపూర్‌లో నిర్వహించిన టెక్‌ఫెస్ట్‌లో కళాశాలకు చెందిన ఐదుగురు కంప్యూటర్ విభాగం విద్యార్థులు యూట్యూబ్ క్వారీ, స్లోవింగ్ అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన సాఫ్ట్‌వేర్‌కు మొదటి బహుమతి లభించిందని, విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ రాంచందర్‌ను అభినందిస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



నిజామాబాద్ రూరల్: దేశంలో ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నరసింహారావు అని ఓసీ సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. పీవీకి కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి కొలవి అనిల్‌కుమార్, నాయకుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.


అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి

బాల్కొండ: అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని బాల్కొండ ఏఎస్సై శంకర్ అన్నారు. శనివారం బాల్కొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిడ్నాప్‌లు, వదంతులపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు పలకరించినా, ఏదైనా వస్తువు ఇచ్చినా తీసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

కిడ్నాపర్ల అరెస్ట్

రుద్రూర్: పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అక్బర్‌నగర్‌కు చెందిన దుర్గవ్వ (19)తోపాటు ఆమె భర్త సాయిలు, వారి కుమారుడు కాశీరాం (3నెలలు)లను గతేడాది సెప్టెంబర్‌లో బోధన్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించి చిన్నారి కాశీరాంను కిడ్నాప్ చేశారు. మద్యం మత్తువీడిన తరువాత సాయిలుకు తన భార్య, కుమారుడు కనిపించకపోవడంతో రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు మహారాష్ట్రలోని బిలోలి శివారులో దుర్గవ్వ మృతదేహం లభించగా, చిన్నారి కాశీరాం ఆచూకీ దొరకలేదు.

తాజాగా జిల్లా కేంద్రంలో..
నిజామాబాద్ రూరల్ స్టేషన్ పరిధిలో ఈ నెల 4వ తేదీన సుమారు ఏడాదిన్నర వయస్సున్న గణేశ్ అనే బాలుడిని దుండగులు కిడ్నాప్ చేశారు. ఈ నేపథ్యంలో అనుమానితులైన బోధన్ మండలం పెంటాకుర్దుకు చెందిన సాయమ్మ, పాండుఫారానికి చెందిన సాయిలును పోలీసులు అదుపులోకి విచారించగా.. ఇద్దరు చిన్నారులు కాశీరాం, గణేశ్‌ను తామే కిడ్నాప్ చేసి హైదరాబాద్‌లో ఒక్కొక్కరికి రూ.లక్షకు విక్రయించినట్లు అంగీకరించారు. కిడ్నాప్ అయిన చిన్నారుల ఆచూకీ కోసం స్పెషల్ టీముకు సమాచారం అందించినట్లు ప్రకటనలో తెలిపారు.



అన్ని వర్గాలకు మేలు



అన్నివర్గాల ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు మహిళల అభ్యున్నతికి మా ప్రభుత్వం పాటుపడుతోంది. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజు నుంచే పథకాలను అమలు చేసే కార్యక్రమాలు మొదలుపెట్టాం. ఈ క్రమంలో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది.
– బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

హామీలను నెరవేర్చే బడ్జెట్



కేవలం రెండు నెలల కాలంలోనే ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చే లక్ష్యంతో రూపొందించిన బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌తో రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్నిరంగాలు అభివృద్ధి పథంలోకి వస్తాయి. ఆరు గ్యారంటీలకు భారీగా నిధులు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. విద్య, వైద్యం, వ్యవసాయం సంక్షేమం, ఇళ్ల నిర్మాణం, పంచాయతీరాజ్ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడంతో సమగ్ర అభివృద్ధి మొదలైనట్లే.
– డాక్టర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్యే, నిజామాబాద్ రూరల్

ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుంది



రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారి ప్రజలకు మేలు జరిగే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి రూ.53,196 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కను అభినందిస్తున్నాము. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుంది. ఇళ్ల నిర్మాణం కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల కోసం, ఇతర అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా నిధులు కేటాయించడం సంతోషకరం. త్వరలోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం, వ్యవసాయానికి భారీ నిధులు కేటాయించడం రైతన్నకు మరింత ఊరట.
– మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యత ఇవ్వడంపై అత్యధిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. గృహజ్యోతి ఇళ్ల పథకానికి నిధుల కేటాయింపు మధ్య, పేద తరగతి వర్గాలకు ఆశాజనకంగా మారింది. వ్యవసాయానికి నిధులు కేటాయించినప్పటికీ.. రుణమాఫీపై స్పష్టత లేకపోవడం రైతులను నిరాశపర్చింది. యూనివర్సిటీలకు ఇచ్చిన నిధులపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గ్యారంటీలపై హర్షం..

- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- చిగురించిన సొంతింటి ఆశలు
- విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత
- యూనివర్సిటీలకు నిరాశ
- ప్రజలకు మేలు చేసే బడ్జెట్ అంటున్న అధికారపక్షం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం శాసనసభలో రూ.2,75,891 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల అభయహస్తం పథకానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఏకంగా రూ.53,196 కోట్లు కేటాయించారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి ఇళ్ల పథకానికి రూ.7,740 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్‌కు రూ.40,080 కోట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం కోసం రూ.45,449 కోట్లు, 24 గంటల విద్యుత్ కోసం రూ.16,825 కోట్లు కేటాయించారు. వ్యవసాయం కోసం రూ.19,746 కోట్లు కేటాయించారు. విద్య కోసం రూ.21,389 కోట్లు, వైద్య విభాగానికి రూ.11,500 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపుల పట్ల అత్యధిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే విశ్వవిద్యాలయాలకు అన్నింటికీ కలిపి రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇవి ఏమాత్రం సరిపోవని విద్యాభిమానులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికబద్ధమైన బడ్జెట్



నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధానమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్య, వైద్యం, ఆరోగ్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, కార్మిక, మహిళ సంక్షేమం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఉద్యోగ ఉపాధి కల్పనలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలకులు ప్రణాళికలు, హేతుబద్ధత లేకుండా చేసిన అప్పులు, ఇప్పుడు బడ్జెట్‌లో పెద్ద సవాళ్లుగా మారాయి. సహేతుకమైన కార్యాచరణతో బడ్జెట్‌లో ప్రణాళిక బద్ధమైన కేటాయింపులు ఉండటం తెలివైన చర్య. ప్రభుత్వం దుబారా వ్యయాన్ని గణనీయంగా తగ్గించడం కోసం కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి నిరర్థకమైన వాటి జోలికెళ్లకుండా కేవలం తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంతోషంగా ఉండటానికి అనుగుణంగానే బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి.
– డా.కేశవులు, తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్

మార్గదర్శకాలు వస్తేనే స్పష్టత

- రూ.2లక్షల రుణమాఫీ కోసం రైతులకు తప్పని నిరీక్షణ

మోర్తాడ్(బాల్కొండ): బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.19,746 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రుణమాఫీపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే రైతుల్లో నెలకొన్న గందరగోళానికి తెరపడే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. తాము అధికారంలోకి వస్తే రూ.2లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. రుణమాఫీ కోసం జిల్లాకు కనీసం రూ.వెయ్యి కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయి. వ్యవసాయశాఖకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రైతుభరోసా, యాంత్రీకరణకు సరిపోతాయని, రుణమాఫీ కోసం ప్రత్యేకంగా కేటాయింపులు ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ లెక్కన రుణమాఫీ ఫలం అందాలంటే రైతులు మరికొంత కాలం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రుణమాఫీకి విధివిధానాలను రూపొందించి కార్యాచరణ మొదలుపెడతామని భట్టి విక్రమార్క చెప్పడం చూస్తుంటే.. మార్గదర్శకాలను జారీ చేసే వరకు రుణమాఫీపై స్పష్టత వచ్చేలా లేదు.

పేదలకు ఇందిరమ్మ గూడు

- జిల్లాలో 17,500 ఇళ్ల నిర్మాణానికి అందనున్న సాయం
- ఒక్కో ఇంటికి రూ.5లక్షలు..
- బడ్జెట్‌లో నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- నెరవేరనున్న సామాన్యుడి కల

మోర్తాడ్(బాల్కొండ): సామాన్యుడి సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి తొలి బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం రూ.7,740 కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, అర్బన్, బోధన్ నియోజకవర్గాల పరిధిలో 17,500ల ఇళ్ల నిర్మాణానికి సాయం అందనుంది. ఒక్కో నియోజకవర్గానికి రూ.175కోట్ల చొప్పున జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రూ.875 కోట్లు అవసరం కానున్నాయి. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో ఇళ్ల నిర్మాణానికి కామారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం ద్వారా నిధులను విడుదల చేస్తారా? లేక నిజామాబాద్ జిల్లా అధికారులకే సాయం అందించే అవకాశం కల్పిస్తారా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులనూ వినియోగించి ఎక్కువ మందికి లబ్ధి చేకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రకటించడంపై పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గృహలక్ష్మి కాదు ఇందిరమ్మ ఇండ్లు
గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పథకం కింద ఒక్కో ఇంటికి రూ.3లక్షల చొప్పున సాయం అందించడానికి ప్రొసిడింగ్‌లు జారీ చేసినా.. వాటిపై అధికారుల సంతకాలు లేకపోవడంతో చెల్లుబాటు కాలేవు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసి ఇందిరమ్మ ఇళ్ల స్కీమును ప్రవేశపెట్టింది. ఫలితంగా సొంత స్థలం ఉండి ఇంటిని నిర్మించుకునేవారికి రూ.5లక్షల సాయం అందుకోవడానికి అవకాశం ఏర్పడింది.

పెళ్లి రోజే మృత్యువు వెంటాడింది..

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డుప్రమాదం
- భార్య దుర్మరణం.. భర్తకు తీవ్ర గాయాలు



నవ్య (ఫైల్)

భిక్కనూరు: ఐదు నిమిషాల్లో ఇంటికి చేరి పెళ్లిరోజు వేడుకల్లో పాల్గొనాల్సి ఉండగా మృత్యువు వెంటాడింది. భిక్కనూరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందడగా, భర్త తీవ్ర గాయాలపాలయ్యాడు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన జమ్మగౌని పేట స్వామి, నవ్య(38) దంపతులు పెళ్లి రోజు సందర్భంగా సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం కూడెల్లి రాజరాజేశ్వరాలయానికి బైకుపై వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని తిరుగుపయనమయ్యారు. జాతీయరహదారి నుంచి భిక్కనూరు చర్చి ప్రాంతం నుంచి మండల కేంద్రంలోకి వస్తుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు వీరి బైకును ఢీకొట్టింది. దీంతో నవ్య రోడ్డుపై పడిపోయి అక్కడి కక్కడే మృతి చెందింది.



ప్రమాద స్థలం

స్వామిగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. వీరిది ఉమ్మడి కుటుంబం. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారు. నవ్య మరణవార్త తెలియగానే గ్రామస్తులు వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కంటతడిపెట్టారు.

అదనపు కలెక్టర్ యాదిరెడ్డి బదిలీ

- ఐదుగురు తహసీల్దార్లకు స్థానచలనం
- మల్టీజోన్-1 పరిధిలోని జిల్లాలకు 9మంది డీటీలు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో..





యాదిరెడ్డి

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రెవెన్యూశాఖలో భారీగా బదిలీల ప్రక్రియ చేపట్టారు. గత జులైలో బదిలీపై జిల్లాకు వచ్చిన అదనపు కలెక్టర్ యాదిరెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెయిటింగ్‌లో ఉన్న ఎస్ కిరణ్‌కుమార్‌ను ఆయన స్థానంలో జిల్లాకు బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్లతోపాటు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు మల్టీజోన్ పరిధిలోని ఆరు జిల్లాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారు ఆయా స్థానాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్థానాల కేటాయింపుపై త్వరలో స్పష్టత
జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. రిటైర్మెంట్ ఉన్న వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించడంతోపాటు ఆయా స్థానాలకు ఇతరులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. నిర్మల్, కామారెడ్డి జిల్లాల నుంచి ఐదుగురిని నిజామాబాద్‌కు బదిలీ చేయగా, నిర్మల్, కామారెడ్డికి మరో ఐదుగురు బదిలీ అయ్యారు. అలాగే నలుగురు తహసీల్దార్లకు నిజామాబాద్‌లోనే డివిజనల్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్లుగా స్థానచలనం కల్పించారు. రాజేందర్(డిచ్‌పల్లి), ఖాజాఖుద్బుద్దీన్(మోపాల్), రాంచందర్(రెంజల్), కె రాములు(డొంకేశ్వర్) స్థానచలనం కలిగిన వారిలో ఉన్నారు. కాగా బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు ఏయే మండలాలు కేటాయిస్తారనేదానిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముందని కలెక్టరేట్ అధికారులు పేర్కొంటున్నారు.

తొమ్మిది మంది డీటీలు..
జిల్లా నుంచి 9మంది డిప్యూటీ తహసీల్దార్లు మల్టీజోన్-1 పరిధిలోని జిల్లాలకు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి తొమ్మిది మంది నిజామాబాద్‌కు బదిలీపై వచ్చారు. జిల్లా నుంచి విజయకాంత్‌రావు, ఖాజా అబ్దుల్ మాజిద్, బి రాజశేఖర్, అబ్దుల్ అజీజ్, దీపారాణి, కార్తీక్ రెడ్డి, జి వినోద్‌కుమార్, జి రంజిత్‌రెడ్డి, మునీరుద్దీన్ ఆదిలాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాలకు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్ నుంచి ఈదర జగదీశ్వరి, వీ గంగాధర్, ఎం తెలంగారావు, జె ప్రకాశ్, బాబుసింగ్, హరీశ్‌కుమార్, వినయ్‌సాగర్, విష్ణువర్ధన్, పద్మ జిల్లాకు బదిలీపై రానున్నారు.

జిల్లాకు అలాట్ అయిన తహసీల్దార్లు		జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు	
పేరు	ప్రస్తుతం పని చేస్తున్న ప్రదేశం	పేరు	ప్రస్తుతం పని చేస్తున్న ప్రదేశం
సునీత	తహసీల్దార్, తాడ్వాయి, కామారెడ్డి	ఎల్ ప్రవీణ్	డీఏవో, ఆర్మూర్, నిజామాబాద్
సరిత	తహసీల్దార్, దిలావర్‌పూర్, నిర్మల్	సతీశ్‌రెడ్డి	డీఏవో, నిజామాబాద్
శ్రీలత	తహసీల్దార్, లక్ష్మణచందా, నిర్మల్	విఠల్	డీఏవో, బోధన్, నిజామాబాద్
కిరణ్మయి	సూపరింటెండెంట్, నిర్మల్ కలెక్టరేట్	ఎస్ఏ రషీద్	సూపరింటెండెంట్, కలెక్టరేట్, నిజామాబాద్
గజానన్	సూపరింటెండెంట్, నిర్మల్ కలెక్టరేట్	వేణుగోపాల్	సూపరింటెండెంట్, కలెక్టరేట్, నిజామాబాద్

మనసే జతగా.. మమతే లతగా!



- కమనీయం కల్యాణ బంధం
- నేడు ప్రపంచ వివాహ దినోత్సవం

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: పెళ్లి, లగ్గం, వివాహం, కల్యాణం.. పేరేదైనా ఏడడుగుల బంధంతో ఒక్కటయ్యే ఆడ, మగ కుటుంబ వ్యవస్థకు పునాదులవుతారు. మూడు ముళ్ల బంధంలో ఒదిగి ముచ్చటగా కాపురం చేసి సమాజంలో ఓ భాగమవుతారు. బాధ్యతలను గుర్తుచేసి కుటుంబంలో తమ పాత్ర ఏమిటో తెలియజేసే వివాహ వ్యవస్థకు మన సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. మూడుముళ్ల బంధంతో ఒక్కటై బాధ్యతలు, బాంధవ్యాలు, కర్తవ్యాలను మనకు జ్ఞప్తికి తెచ్చే వివాహం ప్రతిఒక్కరి జీవితంలో కీలకమైన ఘట్టమే. స్త్రీ, పురుషులు ఒకరి తలపై ఒకరు జీలకర్ర బెల్లం పెట్టి, మాంగల్యం తంతునానేనా అనే పురోహితుడి మంత్రోచ్ఛరణతో ఒక్కటయ్యే గొప్పదైన మన భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచింది. వివాహం భార్య, భర్తలను విడదీయలేని బంధంగా ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవనం సాగిస్తే వందేళ్ల జీవితాన్ని సుఖసంతోషాలతో గడిపేయొచ్చు. మనస్పర్థలు, కోపతాపాలు, అనుమానాలు రేకెత్తకుండా చూసుకోవాలి. కోపతామాలతో నేనే గొప్ప అంటే నేనే గొప్ప అనే అహంకారం, చిన్న చిన్న కారణాలతో కాళ్లపారణి ఆరకముందే విడాకులు తీసుకుంటున్న ఘటనలు నేటి సమాజంలో చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి పరిణామాలు లేని స్వచ్ఛమైన ఆదర్శ దాంపత్యం సాగిపోవాలంటే ఒకరినొకరు అరం చేసుకుని ప్రేమానురాగాలు పెంపొందించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఎన్నో జంటలు ఆదర్శనీయ జీవనం గడుపుతూ నేటి యువతకు స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

50 ఏళ్లు గడిచిపోయాయి



మా పెళ్లి 1972లో జరిగింది. ఈ మధ్యే 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు చేసుకున్నాం. నలుగురు పిల్లలు పెద్దవాళ్లయి, వాళ్ల పిల్లలు కూడా పెరిగి పెద్దయ్యారు. 50 ఏళ్లు గడిచినా మేమిద్దరం అదే ప్రేమ, ఆప్యాయతలతో ఉన్నాం. మా కుటుంబ ఎదుగుదలలో నా భార్య అంజమ్మ సహకారం ఎంతో ఉంది. భార్య, భర్తల మధ్య ప్రేమ, అనురాగాలు పెరుగుతాయే తప్ప తగ్గేవి కాదు.
– వీరేశలింగం–అంజమ్మ (ఎల్లారెడ్డి)

ఆరున్నర దశాబ్దాల వైవాహిక జీవితం



మాకు 1959 మే 30న పెళ్లయ్యింది. దాదాపు 65 ఏళ్లవుతుంది. మాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వాళ్ల పిల్లల పెళ్లిళ్లు కూడా అయ్యాయి. మాది వ్యవసాయ కుటుంబం. ఇప్పటి వరకు మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలకు తావులేదు. నేటి తరం పిల్లలు చిన్నచిన్న వాటికే గొడవలు పడుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు రావు. కలిసి జీవించడంలో సంతోషం ఉంటుంది.
– నిట్టూరి కిషన్‌రావ్ – శాంతాబాయి (అంతంపల్లి, భిక్కనూరు మండలం)

అర్థం చేసుకుంటేనే జీవితానికి పరమార్థం



మాకు 1977 మార్చి 31న వివాహం జరిగింది. నాలుగున్నర దశాబ్దాల వైవాహిక జీవితంలో ఏనాడూ గొడవలు పడింది లేదు. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. పిల్లలంతా సెటిల్ అయ్యారు. వ్యాపారంలో ఎంత బిజీ ఉన్నా కుటుంబానికి సమయం కేటాయించడం ద్వారా ఒకరినొకరు అర్థం చేసుకున్నాం. చిన్న చిన్న విషయాలకు కోపం తెచ్చుకోవడం, ద్వేషించుకోవడం వల్ల ఇబ్బందుల్లో పడతారు. అందుకే కలిసిమెలిసి ఉండే ప్రయత్నం చేయాలి. మన వివాహ వ్యవస్థ ఎంతో గొప్పది.
– పార్సి రాజేందర్ – లక్ష్మి (కామారెడ్డి)

సామరస్య ధోరణి ఉండాలి



మా వివాహం 1985 మే 10న జరిగింది. మాకిద్దరు పిల్లలు. మా బాబు అభినవ చతుర్వేది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సీఐగా, కూతురు సింధు క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. మేమిద్దరం ఉపాధ్యాయులం. ఇద్దరి మధ్య సామరస్య ధోరణి ఉంటే సంసారంలో ఇబ్బందులు తలెత్తవు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగితే జీవితం సంతోషంగా సాగుతుంది.
– గాజుల రాజులు – దేవికారాణి (బాన్సువాడ)

క్లుప్తంగా

డీఆర్డీఏ అడిషనల్‌ పీడీ సంజీవ్‌కు ఘన నివాళి



నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్‌ పీడీ సంజీవ్‌కుమార్‌ శుక్రవారం అనారోగ్యంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం అంత్యక్రియలు పూర్తవగా.. అంతకుముందు మృతదేహం వద్ద అడిషనల్‌ కలెక్టర్‌ యాదిరెడ్డి, చిత్ర మిశ్ర, డీపీవో జయసుధ, డీఆర్‌డీఏ చందర్‌ నాయక్‌, జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు తదితరులు ఘన నివాళ్లు అర్పించారు. ఆయన కుటుంబానికి వారు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. సంజీవ్‌ కుమార్‌ అకాల మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని సంబంధిత శాఖ అధికారులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రశాంతంగా 'నవోదయ పరీక్ష'



నిజాంసాగర్‌(జుక్కల్‌): నిజాంసాగర్‌ జవహర్‌ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 11 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా జరిగాయని ప్రిన్సిపాల్‌ సత్యవతి తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి 1,505 మంది దరఖాస్తు చేసుకోగా 899 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 11వ తరగతిలో ప్రవేశానికి గాను 1,445 మంది దరఖాస్తు చేసుకోగా 990మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ప్రిన్సిపాల్‌ తనిఖీ చేశారు.

జర్నలిజంలో శ్రీకాంత్‌కు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మాస్‌ కమ్యూనికేషన్స్‌ విభాగం పరిశోధక విద్యార్థి, సింగరేణి కాలరీస్‌ కంపెనీ లిమిటెడ్‌ పీఆర్‌వో శ్రీరాముల శ్రీకాంత్‌ డాక్టరేట్‌ అందుకున్నారు. ఇఫ్లూ ఆసోసియేట్‌ ప్రొఫెసర్‌ కంటక రాజారాం పర్యవేక్షణలో 'రోల్‌ ఆఫ్‌ సోషల్‌ మీడియా ఇన్‌ సోషల్‌ అండ్‌ పొలిటికల్‌ మూమెంట్స్‌– ఏ కేస్‌ స్టడీ ఆఫ్‌ తెలంగాణ మూమెంట్‌' అనే అంశంపై శ్రీకాంత్‌ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. కరీంనగర్‌ జిల్లాకు చెందిన శ్రీకాంత్‌ ఎనిమిదేళ్లుగా సింగరేణి కాలరీస్‌లో వెల్ఫేర్‌ ఆఫీసర్‌గా, పర్సనల్‌ అధికారిగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో కంపెనీ ప్రజాసంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శ్రీకాంత్‌ను సంస్థ జీఎం (కో–ఆర్డినేషన్‌) చీఫ్‌ పబ్లిక్‌ రిలేషన్స్‌ అధికారి సురేష్‌ అభినందనలు తెలిపారు.

మిశ్రమ స్పందన

సాక్షి నెట్‌వర్క్‌, నిజామాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లావాసులు మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించారంటూ విద్యార్థి సంఘాల నాయకులు నిరాశను చెందారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్‌ స్కూల్స్‌ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని మేధావులు స్వాగతించారు. బీసీలకు తక్కుల నిధులు కేటాయించారని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. వ్యవసాయానికి ప్రాధాన్యం కల్పించారని పలువురు రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఫసల్‌ బీమాను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఫసల్‌ బీమాను స్వాగతిస్తున్నాం..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌ బీమా యోజన పథకాన్ని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అమలు చేయలేదు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం బడ్జెట్‌లో ఫసల్‌ బీమాను రాష్ట్రంలోనూ వర్తింపజేస్తామని ప్రకటించడాన్ని మేము స్వాగతిస్తున్నాం. వీలైనంత త్వరగా దీనిని అమలు చేయాలి. అలాగే పంటలకు కనీస మద్ధతు ధరలు కల్పిస్తే బాగుంటుంది.

–చిన్నా, బీజేపీ నాయకులు, డొంకేశ్వర్‌

విద్యారంగానికి సముచితస్థానం..



రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను డిజిటల్‌ పాఠశాలలుగా మార్చాడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 21వేల కోట్లు నిధులు కేటాయించడం హర్షణీయం. పేద పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్‌ అములు పరుస్తు రాష్ట్రన్ని ఎడ్యుకేషన్‌ హబ్‌గా మారుస్తామాని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయం.

–పెంట జలంధర్‌, పీఆర్టీయూ నాయకుడు, ఆర్మూర్‌

వ్యవసాయానికి ప్రాధాన్యం..



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరం. ఎకరానికి రూ. 15వేల పెట్టుబడి సాయం ఇస్తు వ్యవసాయానికి సుమారు రూ. 19వేల కోట్లు విడుదల చేయడం గొప్ప విషయం. ఇది నిజంగా రైతులను రాజులుగా చేసే బడ్జెట్‌.

–చిన్నారెడ్డి, రైతు, మగ్గిడి

ఉపాధిపై దృష్టి పెట్టలేదు..



యువతకు ఉపాధి కలిగించే పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరం. యువత స్వయం శక్తిపై నిలబడేందుకు అవసరమైన రాజీవ్‌ యువశక్తి ఇతర నూతన పథకాలకు నిధులు కేటాయింపులు పెంచితే బాగుండేది.

–పురుషోత్తం, యువజన నాయకుడు, ఆర్మూర్‌

రుణమాఫీ ఊసే లేదు..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతు రుణ మాఫీకి నిధులు కేటాయించకపోవడం నిరాశ పరిచింది. వైద్య, విద్య రంగాలకు కూడా నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉంది. ఆరు గ్యారంటీ పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం ఊరట కలిగించే అంశం.

– దేంబాల్‌ శశిధర్‌ రెడ్డి, రైతు, నల్లవెల్లి

యూనివర్సిటీలకు మేలు



ప్రస్తుత బడ్జెట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి నిధులు కేటాయించడం శుభపరిణామం. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత కాంగ్రెస్‌ హయాంలో యూనివర్సిటీకి పూర్వవైభవం రానున్నది. అన్నిరకాల అభివృద్ధి జరగనున్నది. బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం.

–పంచరెడ్డి చరణ్‌, తెయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు

విద్యారంగంపై నిర్లక్ష్యం..



కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 11.3% నిధులు మాత్రమే కేటాయించింది. విద్యారంగం బాగుపడాలంటే కనీసం 30% నిధులు కేటాయించాలి. కానీ నేటి బడ్జెట్‌లో అరకొరా నిధులు కేటాయించడం చూస్తే కాంగ్రెస్‌ సర్కారు కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని అర్థమవుతుంది. వెంటనే బడ్జెట్‌ను సవరించి అధిక నిధులు కేటాయించాలి.

–రాజేశ్వర్‌, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైతు సంక్షేమ బడ్జెట్‌..



గత ప్రభుత్వం రైతు రుణ మాఫీ విషయంలో రైతులను మోసం చేసింది. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీకి బడ్జెట్‌ను కేటాయించడం సంతోషకరం. రూ.2లక్షలు ఒకేసారి రుణమాఫీ చేయడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. రైతులకు న్యాయం చేసేది కేవలం కాంగ్రెస్‌ ప్రభుత్వమే. ఇది పూర్తిగా రైతు సంక్షేమ బడ్జెట్‌ అని చెప్పవచ్చు.

–భూమేశ్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు, డొంకేశ్వర్‌

విద్యా రంగానికి 30శాతం నిధులు ఇవ్వాలి..



విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరైనది కాదు. బడ్జెట్‌లో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని, రాష్ట్ర బడ్జెట్‌లో 8.1% నిధులు మాత్రమే కేటాయించింది. యూనివర్సిటీలకు రూ. 500 కోట్లు మాత్రమే కేటాయించింది. కనీసం విద్యారంగానికి బడ్జెట్‌ లో 30% నిధులు కేటాయించాలి.

–ప్రిన్స్‌, పీడీఎస్‌యూ ఆర్మూర్‌ డివిజన్‌ అధ్యక్షుడు.

'పబ్లిక్‌ స్కూల్స్‌'ను స్వాగతించాల్సిందే..



రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్‌ హబ్‌గా తయారు చేయడానికి ప్రతి మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్‌ స్కూల్స్‌ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించడం స్వాగతించాల్సిందే. రూ. 21,389కోట్లు మాత్రమే విద్యారంగానికి కేటాయించడం నిరాశపరిచింది. విద్యారంగానికి ఆశించిన ప్రయోజనం జరగకపోవచ్చు.

–ఏ పున్నయ్య, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, తెయూ

నిరాశకు గురిచేసింది..



ప్రతి మండలానికి కార్పొరేట్‌ స్థాయి తెలంగాణ పబ్లిక్‌ స్కూల్స్‌ ఏర్పాటు చేస్తామనడం హర్షణీయం. రాష్ట్రంలో 55 శాతం ఉన్న బీసీల అభివృద్ధికి, బీసీ సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం అతి తక్కువ బడ్జెట్‌ కేటాయించడం నిరాశకు గురిచేసింది.

–వినోద్‌కుమార్‌, జిల్లా అధ్యక్షుడు, బీసీటీయూ

బీసీలను నిరాశపరిచారు..



రాష్ట్రంలో 56శాతం జనాభా కలిగిన బీసీలకు రూ.8వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించడం చాలా నిరాశపరిచింది. జనాభా దామాషా ప్రకారం రూ.56 వేల కోట్ల బడ్జెట్‌ కేటాయిస్తేనే, బీసీలకు న్యాయం జరుగుతుంది. బీసీ సబ్‌ ప్లాన్‌ అమలుతో లబ్ధి చేకూరుతుంది.

–నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్‌

బీసీలకు అన్యాయం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓట్‌ ఆన్‌ అకౌంట్‌ బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగింది. రాష్ట్ర జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు కేవలం రూ.8వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించడం దారుణం. కనీసం రూ.20వేల కోట్ల కేటాయింపులు చేస్తే, బాగుండేది.

–సుజీత్‌సింగ్‌ ఠాకూర్‌, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి

బడ్జెట్‌కు సంపూర్ణ మద్దతు..



కాంగ్రెస్‌ ప్రభుత్వం వేతన జీవులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించి అండగా ఉంటామని ప్రకటించింది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి ఉద్యోగులందరం కృషి చేస్తాం. రాష్ట్ర బడ్జెట్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుంది.

–అలుక కిషన్‌, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించి వారి వెన్నంటే ఉంటామన్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే బడ్జెట్‌లో విద్య, వైద్యరంగాలకు అధిక కేటాయింపులు చేయడం అభివృద్ధికి సూచికగా భావిస్తున్నాం.

–రమణ్‌రెడ్డి, ట్రెసా జిల్లా అధ్యక్షుడు

విద్యారంగానికి అన్యాయం..



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి 8శాతం లోపే నిధులు కేటాయించడం అంటే విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడమే.

–జయంతి, తెయూ పీడీఎస్‌యూ కార్యదర్శి

మార్ఫింగ్‌ చేసి రూ. 7లక్షల లోన్‌ నొక్కేశారు

- హైదరాబాద్‌ బిట్స్‌ పిలాని క్యాంపస్‌ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వ్యవహారం
- ఇసన్నపల్లి, గొర్రెల కాపరికి ఇబ్బంది
- గతంలో కామారెడ్డిలో పర్స్‌ పోగొట్టుకున్న బాధితుడు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): పర్స్‌ పోగొట్టుకోవడం.. అందులో డూప్లికేట్‌ ఆధార్‌, ఓటర్‌, పాన్‌ కార్డులు ఉండటం.. గొర్ల కాపరైన కన్నపురం బాలమల్లును చిక్కుల్లో పడేసింది. ఆయన ఫొటోను మార్ఫింగ్‌ చేసి గుర్తు తెలియని వ్యక్తి, బ్యాంక్‌ సిబ్బంది కుమ్మక్కై వ్యక్తిగత లోన్‌ తీసుకున్నారు. ఫలితంగా ప్రస్తుతం బాలమల్లుకు బ్యాంకు నోటీసులు వస్తున్నాయి. వివరాల్లోకెళ్తే.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన కన్నపురం బాలమల్లు గొర్ల కాపరి. 2019లో కామారెడ్డికి పనిమీద వెళ్లినప్పుడు జేబులో ఉన్న పర్సును పోగొట్టుకున్నాడు. పర్సులో డూప్లికేట్‌ ఆధార్‌ కార్డ్‌, పాన్‌ కార్డ్‌, ఎలక్షన్‌ కార్డు, రూ వంద నగదు ఉన్నాయి. కార్డులన్నీ డూప్లికేట్‌వి కావడంతో బాలమల్లు పెద్దగా పట్టించుకోలేదు. 2021లో హైదరాబాద్‌ ఎస్‌బీఐ జవహర్‌నగర్‌ శాఖ నుంచి ఆయనకు నోటీసు వచ్చింది. బాలమల్లు రూ.7 లక్షల వ్యక్తిగత లోన్‌ 2019లో తీసుకుని వాయిదాలను చెల్లించడం లేదని 2021లో నోటిసును జారీ చేశారు. తాను తీసుకోని లోన్‌పై నోటీసులు రావడంతో బాలమల్లు అవాక్కయ్యాడు. బ్యాంకు రికవరీ సిబ్బంది ఫోన్లు చేయడంతో బాలమల్లు తెలిసిన వారిని తీసుకొని సదరు బ్యాంకు శాఖకు వెళ్లారు. ఆ శాఖలోని ఫైల్స్‌ అన్ని తీయించగా బాలమల్లుకు సంబంధించిన డూప్లికేట్‌ ఆధార్‌ కార్డ్‌, పాన్‌ కార్డు ఎలక్షన్‌ కార్డులపై గుర్తుతెలియని వ్యక్తి ఫోటోలు మార్ఫింగ్‌ చేసి, బ్యాంక్‌ అధికారులతో కుమ్మక్కై ఏడు లక్షల లోను నొక్కేసినట్లు తేలింది..

ఎడ్యుకేషన్‌ కోసం ఇచ్చే లోన్లు..

హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌ కీసర రోడ్డులో షామీర్‌పేట ప్రాంతంలో గల బిట్స్‌ పిలాని క్యాంపస్‌ లోపల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో కేవలం ఎడ్యుకేషన్‌ లోన్లు మాత్రమే ఇస్తామని బ్యాంకు మేనేజర్‌ బీపుల్‌కుమార్‌దాస్‌ తెలిపారు. అయితే ఆ బ్యాంకులో గతంలో పనిచేసిన మేనేజరు కుమ్మక్కై బాలమల్లు కార్డులపై మరో వ్యక్తికి వ్యక్తిగత లోన్‌ మంజూరు చేసినట్లుగా బ్యాంక్‌ అధికారులే అంగీకరించారు. కేసును కోర్టుకు అప్పగించామని, లాయర్‌తో మాట్లాడి బాలమల్లు పేర్లు తొలగిస్తామని బ్యాంక్‌ అధికారులు చెప్తున్నారు. అయితే బాలమల్లు మిత్తితో కలిపి 12 లక్షలు అప్పును కట్టాల్సి వస్తుందని ఆవేదనతో ఎన్నోసార్లు హైదరాబాద్‌కు తెలిసిన వారిని తీసుకెళ్లి, అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నాడు. తప్పుడు లోన్లు తీసుకున్న వారిపై కేసు నమోదు చేయకుండా, తమ శాఖకు సంబంధించిన లాయర్‌తో మాట్లాడుకోవాలని అతడికి బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. కాగా లోన్‌ డబ్బులు చెల్లించాలని బాలమల్లుకు ఫోన్లు వస్తూనే ఉన్నాయి.

క్రైం కార్నర్‌

బాల్కొండలో కత్తిపోట్ల కలకలం

- పాత కక్షలతో ఒకరిపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు





కత్తిపోట్లకు గురైన రఫీక్‌.. హోటల్‌ వద్ద గుమిగూడిన జనం

బాల్కొండ: మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో టీ తాగుతున్న వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో శనివారం దాడి చేయడంతో కలకలం రేగింది. ఎస్సై గోపి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రఫీక్‌ వన్నెల్‌(బి) చౌరస్తాలోని ఓ హోటల్‌ వద్ద టీ తాగుతుండగా, అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు సయ్యద్‌ సోఫియాన్‌, సయ్యద్‌ రియాన్‌లు పాత కక్షలను మనుసులో అతడిపై కత్తితో దాడి చేశారు. రఫీక్‌ తప్పించుకోవడానికి యత్నించగా చేతులకు, ఇతర చోట్ల గాయాలయ్యాయి. వీరిని అడ్డుకోవడానికి వెళ్లిన అతారొద్దీన్‌ సైతం గాయపడ్డాడు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌

లింగంపేట/ఎల్లారెడ్డి: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలో కొన్ని నెలల క్రితం జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్‌, పోలీసులు శనివారం వివరాలను వెల్లడించారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మద్దెల కమలవ్వ అనే వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. గుర్తు తెలియని వ్యక్తి అక్టోబర్‌ 11న రాత్రి వేళ ఇంట్లోకి ప్రవేశించి కమలవ్వను గొంతు పిసికి హత్య చేశారు. మృతు రాలి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు అపహరించుకెళ్లాడు. పోలీసులు విచారణ చేపట్టగా.. అదే గ్రామానికి చెందిన పర్మాల రాజుపై అనుమానం వ్యక్తం చేశారు. అతడు పరారీలో ఉండగా, శనివారం శెట్పల్లిచౌరస్తాలో పట్టుకొని విచారణ చేశారు. నేరం ఒప్పుకోవడంతో అతడి వద్ద నుంచి బంగారం రికవరి చేసి, రిమాండుకు తరలించారు. కేసును ఛేదించిన సీఐ రవీందర్‌నాయక్‌, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది రాజు, లిక్యా నాయక్‌ను డీఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

బాలిక కిడ్నాప్‌కు యత్నం

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ఎంఎస్‌సీ ఫారంలో ఓ బాలికను గుర్తుతెలియని దుండగులు కిడ్నాప్‌కు యత్నించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ప్రీతి జైతాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం బడి నుంచి ఎమ్మెస్సీ ఫారంకు కాలినడకన ఒంటరిగా బయలుదేరింది. గ్రామ సమీపాన వ్యాన్‌ ఆపిన గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బాలికకు చాక్లెట్‌ ఇవ్వగా, నిరాకరించి ముందుకు నడిచింది. వారు బాలికను వెంబడిస్తుండగా, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనబడడంతో వ్యక్తి దగ్గరికి వెళ్ళింది. వెంటనే ఆ వ్యక్తికి జరిగిన విషయం చెప్పడంతో దుండగులు పారిపోయారు. ఈ ఘటనతో ఎంఎస్సీ ఫారం, జైతాపూర్‌ గ్రామస్తులు అప్రమత్తమయ్యారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోర్తాడ్‌: కాకతీయ కాలువలో రెండు రోజుల కిందట గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద లభ్యమైంది. గౌతమ్‌ గురువారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాలువలోకి దిగగా అందులో పడిపోయాడు. అతన్ని రక్షించేందుకు సోదరుడు గణేష్‌ కాలువలోకి దూకాడు. అంతలోనే గౌతమ్‌ బయటకు రాగా గణేష్‌ నీటి ప్రవాహంలో కొట్టుకపోయాడు. రెండు రోజులుగా అతడి ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాత్రి కాలువకు నీటివిడుదలను అధికారులు నిలిపివేశారు. దీంతో శనివారం గణేష్‌ మృతదేహం ఇబ్రహీంపట్నం వద్ద కనిపించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

మొరం టిప్పర్ల పట్టివేత

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌ శివారులో మొరం అక్రమ రవాణాకు పాల్పడుతున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరంను రవాణా చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో దాడి చేశామన్నారు. పట్టుకున్న మొరం టిప్పర్లను తహసీల్దార్‌కు అప్పగించగా రూ. 5వేల చొప్పున జరిమానా అధికారులు పోలీసులు తెలిపారు.

ఇంట్లో నుంచి బంగారం అపహరణ

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి గ్రామంలో శనివా రం ఉదయం ఓ ఇంట్లో నుంచి బంగారం నగలు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన ఆకుల గంగామణి ఓ శుభకార్యానికి వెళ్లడానికి బంగారు నగలను బీరువాలో నుంచి బయటకు తీసింది. ఇంటి పనులు ముగించుకొని, నగల వద్ద కు రాగా 3 తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దుండగుల కోసం వెంటనే చుట్టుపక్కల వారి సా యంతో ఎంత గాలించిన ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌, ఎస్సై ఉయద్‌కుమార్‌ తెలిపారు.

పార్టీ ప్రతిష్ట దెబ్బతీస్తే చర్యలు

- సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ కులాచారి



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: బీజేపీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ కులాచారి హెచ్చరించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ క్రమశిక్షణకు మారు పేరు అని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. అభిప్రాయాలు చెప్పుకునేందుకు వేరే వేదికలు ఉంటాయని, కానీ మీడియా సమావేశాలు, సోషల్‌ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టవద్దని తెలిపారు. పార్లమెంట్‌ టికెట్‌ ఖచ్చితంగా తనకే వస్తుందని ఇటీవల విలేకర్ల సమావేశంలో ఓ సీనియర్‌ నాయకుడు ప్రకటించారని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు ఎమ్మెల్సీ కవితతో కుమ్మక్కై బీజేపీపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే ఈవిషయాన్ని పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, నారాయణ యాదవ్‌, ఆకుల శ్రీనివాస్‌, సుక్క మధు, ఇప్పకాయల కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

పనికి వెళ్లలేదని నిలదీసిన భార్య: భర్త ఆత్మహత్య

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): పనికి ఎందుకు వెళ్లలేదని భార్య ప్రశ్నించినందుకు మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రాంబాలు సందీప్‌(29) కొంత కాలంగా మతిస్థిమితం లేకపోవడంతో చాలాసార్లు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయి, తిరిగి వచ్చాడు. శనివారం ఉదయం కూలి పనికి ఎందుకు వెళ్లలేదని భార్య రచన ప్రశ్నించడంతో ఇరువురు గొడవపడ్డారు. ఆవేశానికిగురైన సందీప్‌ ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

బోధన్‌రూరల్‌(బోధన్‌): మండలంలోని ఖండ్‌గావ్‌ గ్రామానికి చెందిన వివాహిత మనీషా (26) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్‌ఐ నాగనాథ్‌ శనివారం తెలిపారు. ఈ ఘటనపై మృతురాలు అనారోగ్య సమస్యతో (కడుపునొప్పి) బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి రాజు (మహారాష్ట్ర) ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్‌

- ఒడిశా సరిహద్దులో అదుపులోకి..
- రిమాండ్‌కు తరలింపు

కామారెడ్డి క్రైం: కామారెడ్డితో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు లిక్విడ్‌ గంజాయిని సరఫరా చేస్తున్న ఓ కీలక నిందితుడిని రూరల్‌ పోలీసులు పట్టుకుని రిమాండ్‌ చేశారు. ఇందుకోసం కామారెడ్డి నుంచి ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతానికి వెళ్లి ప్రత్యేక ఆపరేషన్‌ చేపట్టారు. నిందితుడు వంతెల ఏసయ్య శుక్రవారం పోలీసులకు చిక్కడంతో శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా దేవునిపల్లి ఎస్సై రాజు వివరాలు వెల్లడించారు. దాదాపు 20 రోజుల క్రితం జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి శివారులో ఏడుగురు యువకులను గంజాయి కేసులో పట్టుకుని వారి వద్ద నుంచి లిక్విడ్‌ గంజాయి డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఇద్దరు గంజాయి విక్రేతలు కాగా మరో ఐదుగురు కొనుగోలు చేసి సేవించేవారుగా గుర్తించారు. అసలు గంజాయి ఎక్కడ నుంచి వస్తుంది, ఎవరు సరఫరా చేస్తున్నారనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని గ్రామాల నుంచి కామారెడ్డికి లిక్విడ్‌ రూపంలో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు విచారణలో తేలింది. కూపీ లాగిన దేవునిపల్లి పోలీసులు విశ్వసనీయ సమాచారం ద్వారా నిఘా పెట్టారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గాలిపాడు గ్రామంలో దాడులు చేసి లిక్విడ్‌ గంజాయి కేసులో ప్రధాన నిందితుడైన ఏసయ్యను అదులోపుకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 270 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన దేవునిపల్లి ఎస్సై, సిబ్బందిని ఎస్పీ సింధు శర్మ, ఏఎస్పీ నర్సింహా రెడ్డి, డీఎస్పీ ప్రకాశ్‌ అభినందించారు.

క్రేన్‌ ఢీకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్‌: మామిడిపల్లి చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన సయ్యద్‌ మౌలానా(60) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు క్రేన్‌ ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పెర్కిట్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వస్తున్న క్రేన్‌ మామిడిపల్లి చౌరస్తా వద్ద రెడ్‌ సిగ్నల్‌ పడటంతో ఆగింది. గ్రీన్‌ సిగ్నల్‌ పడటంతో క్రేన్‌ ముందుకు సాగగా, నడచుకుంటు వెళుతున్న మౌలానా టైర్‌ కింద పడటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఘటన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు.